## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన



వేంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

**అల్లాదుర్గం(మెదక్):** పట్టణంలోని పూరాతన వేంకటేశ్వర దేవాలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోత్సరణలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరై, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, నాయకులు శ్రీశైలం, మహేశ్, శ్రీనివాస్, విఠల్‌రెడ్డి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

### నిరుపేదలకు మెరుగైన వైద్యం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**మనోహరాబాద్(తూప్రాన్):** గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే తమ లక్ష్యమని రెడ్‌క్రాస్ స్టేట్ కో–ఆర్డినేటర్ స్వర్ణలత, స్టేట్ ఎంబీసీ మెంబర్ సింగం శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని కూచారం గ్రామంలో రెడ్‌క్రాస్ సంస్థ, వీఎస్టీ పరిశ్రమ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు, పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు, కస్తూర్బా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. పలువురికి రక్త పరీక్షలు చేసి వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు వికాస్, మెదక్ జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుభాష్ చంద్రబోస్, సతీష్‌రావు ఎంబసీ మెంబర్, వీఎస్టీ పరిశ్రమ సెక్యూరిటీ మేనేజర్ గోపీకృష్ణ, నాయకులు లక్ష్మీకాంతరావు, లక్ష్మీనర్సింలుగౌడ్, సంతోష్‌పంతులు, కిరణ్‌కుమార్‌యాదవ్, కార్యదర్శి వేణుగోపాల్, ఏఎస్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**వెల్దుర్తి(తూప్రాన్):** మాసాయిపేట మండలంలోని రామంతాపూర్‌తండా ప్రాథమిక పాఠశాలను బుధవారం నర్సాపూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, ఎంపీడీఓ జగదీశ్వరాచారి సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సకాలంలో బిల్లులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నిర్వాహకులు చెప్పడంతో సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నవీన్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌నాయక్, ఫకీరా తదితరులు పాల్గొన్నారు.

### అకాల వర్షానికి కూలిన పాఠశాల ప్రహరీ



కూలిన కర్నాల్‌పల్లి పాఠశాల ప్రహరీ

**చేగుంట(తూప్రాన్):** ఇటీవల కురిసిన అకాల వర్షానికి మండలంలోని కర్నాల్‌పల్లి ప్రాథమిక పాఠశాల ప్రహరీ కూలిపోయింది. గతంలో పాఠశాలకు సంబంధించిన ప్రహరీ కొంత భాగం పడిపోయింది. ఇటీవల మూడు రోజుల క్రితం ఈదురు గాలులతో వడగళ్ల వాన కురవడంతో ప్రహరీ కూలిపోయింది. అధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### విద్యుత్ షాక్‌తో వానరం మృతి

**చిన్నశంకరంపేట(మెదక్):** మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ వైర్లకు చిక్కుకొని వానరం మృతి చెందింది. బుధవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలో విద్యుత్ సరాఫరా నిలిచిపోయింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడానికి కారణమైన వానరాన్ని గుర్తించిన ట్రాన్స్‌కో సిబ్బంది వానరాన్ని ట్రాన్స్‌ఫార్మర్‌పై నుంచి తొలగించారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద లైన్‌లైన్‌ను చెంజ్ చేసి విద్యుత్ సరాఫరా పునరుద్ధరించారు.

# భగీరథ వాటర్ ట్యాంకులో నాచు

**కలుషితమవుతున్న తాగునీరు**

**నర్సాపూర్ రూరల్:** మిషన్ భగీరథ ట్యాంకును శుభ్రం చేయకపోవడంతో నాచు పేరుకుపోయి తాగునీరు కలుషితమవుతున్నాయని మండలంలోని నత్నయ్యపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా ఎస్సీ కాలనీలో ఉన్న మిషన్ భగీరథ ట్యాంకును శుభ్రం చేయడం లేదని తెలిపారు. దీంతో నల్లాల ద్వారా సరఫరా అవుతున్న నీటిలో నాచు వస్తుందని, ఆ నీటిని తాగలేకపోతున్నామన్నారు. మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతున్నా.. వ్యవసాయ బోరులు ఆశ్రయించి తాగునీటి అవసరాలను తీసుకుంటున్నామని చెప్పారు. మిషన్ భగీరథ ట్యాంక్ మెట్లు కొన్ని నెలల క్రితం ధ్వంసం అయ్యాయన్నారు. అప్పటి నుంచి ట్యాంకును



మిషన్ భగీరథ తాగునీటిలో నాచు

శుభ్రం చేయకపోవడంతో నాచు పేరుకుపోయిందని పలుమార్లు అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి వివరణ సంగీతను వివరణ కోరగా.. ట్యాం



నత్నయపల్లి ఎస్సీ కాలనీలో మెట్లు లేని ట్యాంకు

కులు శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ట్యాంక్‌పైకి మెట్లు లేకపోవడంతో శుభ్రం చేసేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నట్లు వివరించారు.

# ఆలయానికి నిధులు మంజూరు చేయండి

**రామాయంపేట(మెదక్):** పట్టణంలో విశ్వకర్మ సంఘం భవనం, బ్రహ్మంగారి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విశ్వకర్మ సంఘం సభ్యులు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సంఘం సభ్యులు గురువారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు లక్ష్మణాచారి, పట్టణ అధ్యక్షుడు కమ్మరి యాదగిరిచారి, ఉపాధ్యక్షుడు పాండుచారి, ప్రధాన కార్యదర్శి నరేందర్, సుంకోజ దామోదర్, పాల్గొన్నారు.



మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌కు వినతి పత్రం అందిస్తున్న విశ్వకర్మ సంఘం సభ్యులు

# బీఎల్‌ఓలు నిబద్ధతతో పనిచేయాలి



వెల్దుర్తి: బీఎల్‌ఓలకు సూచనలిస్తున్న అధికారులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న శిక్షకుడు శ్రీనివాస్

**వెల్దుర్తి(తూప్రాన్):** ఓటర్ల నమోదు ప్రక్రియలో బీఎల్‌ఓలు నిజాయతీ, నిబద్ధతతో పని చేయాలని తహసీల్దార్ తులసీరాం అన్నారు. బుధవారం అంగవైకల్యం ఉన్నవారు, 85 ఏళ్ల పైబడిన వృద్ధులు ఇంటి వద్దనే ఓటువేసే విషయమై తహసీల్దార్ కార్యాలయంలో ఉమ్మడి మండలం(వెల్దుర్తి, మాసాయిపేట మండలాల) బీఎల్‌ఓ, సూపర్‌వైజర్‌లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు జయభారత్‌రెడ్డి, యాదగిరి, ప్రసాద్, హఫీజ, తదితరులు పాల్గొన్నారు.

**ఓటరు జాబితాను సిద్ధం చేయాలి**

**చిలప్‌చెడ్(నర్సాపూర్):** పార్లమెంట్ ఎన్నికల సమయానికి పోస్టల్ బ్యాలెట్, ఓటరు జాబితాను పక్కాగా సిద్ధం చేయాలని తహసీల్దార్ ముసాద్దీక్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రం చిలప్‌చెడ్ రైతువేదికలో బీఎల్‌ఓలకు ఓటరు నమోదుపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ముసాద్దీక్, శిక్షకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పొప్పులు లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి బీఎల్‌ఓలకు ప్రత్యేక అవగాహన కల్పించామన్నారు. గ్రామాల్లో ఓటు హక్కుపై పూర్తిస్థాయి అవగాహన వచ్చేలా బీఎల్‌ఓలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్, ఎంపీఎస్‌ఓ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలో సామూహిక సీమంతాలు



టేక్మాల్(మెదక్): సీమంతాలు చేస్తున్న అంగన్‌వాడీలు

**టేక్మాల్(మెదక్):** పోషణ పక్వాడ్‌లో భాగంగా మండల కేంద్రం టేక్మాల్ గాంధీభవన్‌లో బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీశైలమ్మ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... డిస్ట్రిక్ హబ్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్, బేటి బచావో – బేటి పడావో ప్రచారంలో భాగంగా చిరుధాన్యాల ప్రదర్శన, పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు చిన్న పిల్లలు పౌష్టికమైన ఆహారాన్ని తీసుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. బాలల రక్షణ, సుకన్య సమృద్ధి యోజన పథకం, బాల్యవివాహాలు, ఉమెన్ ట్రాఫికింగ్, ఫోక్సో చట్టాలపై వివరించారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో 1098, 181, 100 టోల్‌ఫ్రీ నంబర్‌లకు నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారిత కేంద్రం సిబ్బంది నాగమణి, రమేశ్, కవిత, ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.



తూప్రాన్ అంగన్‌వాడీ కేంద్రంలో..

**తూప్రాన్ అంగన్‌వాడీ కేంద్రంలో..**


**తూప్రాన్:** అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషన్ పక్వాడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులకు పోషక ఆహారంపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం విజయకుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అంజమ్మ, అంగన్‌వాడీ టీచర్ ఇందిర, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## వృద్ధురాలు ఆత్మహత్య

**టేక్మాల్(మెదక్):** వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రమైన టేక్మాల్‌లో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. టేక్మాల్ పంచాయతీ పరిధిలోని గొల్లగూడెంకు చెందిన నిరూడి కిష్టమ్మ (70) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చూయించుకున్నా.. ఆరోగ్యం కుదుట పడలేదు. దీంతో మనస్తాపం చెంది చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మురళి తెలిపారు.

## ఎస్పీని కలిసిన టేక్మాల్ యువకులు

**టేక్మాల్(మెదక్):** మెదక్ ఎస్పీ బాలస్వామిని బుధవారం టేక్మాల్‌కు చెందిన ఆదర్శయూత్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరించినట్లు తెలిపారు. ఇటీవల జాతీయ అవార్డు అందుకున్న ఆదర్శ యూత్ మాజీ అధ్యక్షుడు చింత రమేశ్‌ను ఎస్పీ అభినందించారు. గ్రామాల్లో సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని సూచించనట్లు రమేశ్ తెలిపారు.



ఎస్పీకి అంబేడ్కర్ చిత్రపటాన్ని అందిస్తున్న యువకులు

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

**శివ్వంపేట(నర్సాపూర్):** ఎన్నికల నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని తూప్రాన్ సీఐ కృష్ణ అన్నారు. బుధవారం రాత్రి తూప్రాన్ – నర్సాపూర్ హైవే పోతారం చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాహనాల తనిఖీ కోసం అవసరం ఉన్న చోట్ల చెక్‌పోస్టులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.



వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న సీఐ

# శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

**నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి**

**నర్సాపూర్ రూరల్:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి అన్నారు. బుధవారం నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి, ఎస్‌ఐ పుష్పరాజ్ ఆధ్వర్యంలో నర్సాపూర్ పట్టణంతో పాటు మండలంలోని చిన్నచింతకుంటలో మిలటరీ, పోలీసు బృందాలతో ప్రధాన రోడ్లు, వీధుల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ బాలస్వామి అధికరణకు శాంతి భద్రతల సంరక్షణ కోసం మిలిటరీ, పోలీసుల బృందాలతో కవాతు చేస్తున్నామని చెప్పారు. రాజకీయ పార్టీల నాయకులతో పాటు కార్యకర్తలు, ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణకు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు.

**గ్రామాల్లో నిఘా ఏర్పాటు**

**కౌడిపల్లి(నర్సాపూర్):** ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక గ్రామాల్లో నిఘా ఏర్పాటు చేశామని నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి అన్నారు. బుధవారం కౌడిపల్లి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు, ఇతర కేసుల వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. మండలంలోని కంచన్‌పల్లి, వెల్మకన్న, తిమ్మాపూర్, కౌడిపల్లి సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి ఇప్పటికే పోలీస్‌లు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో గట్టినిఘా ఏర్పాటు చేశామన్నారు. గ్రామస్తులకు సమస్య ఉంటే పోలీస్‌లకు ఫిర్యాదు చేయాలన్నారు. చట్టం ముందు అందరు సమానమేనని వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నట్లు, వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



కౌడిపల్లి పీఎస్‌లో కేసుల వివరాలు తెలుసుకుంటున్న సీఐ జాన్‌రెడ్డి

# ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా

**ఎంపీ బీబీ పాటిల్**

**శివ్వంపేట(నర్సాపూర్):** ఎంతో చరిత్ర కల్గిన ఆలయాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ కుటుంబ సమేతంగా బుధవారం మండలంలోని పలు ఆలయాలను దర్శించుకున్నారు. మండల కేంద్రంలోని బగలాముఖీ అమ్మవారితో పాటు చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శివ్వంపేటలో నిర్మించిన బగలాముఖీ ఆలయ విశిష్టతను చి వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ వివరించారు. అలాగే చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయం గురించి ఆలయ చైర్మన్ ఆంజనేయశర్మ ఎంపీకి చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మురళీధర్‌యాదవ్, బీజేపీ మండలాధ్యక్షుడు పెద్దపులి రవి, నాయకులు రమణరావు, ఆంజనేయులుగౌడ్, అశోక్, తదితరులు ఉన్నారు.



బగలాముఖీ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ బీబీ పాటిల్

# రైతు కుటుంబాలను ఆదుకోవాలి

**నిజాంపేట(మెదక్):** రెండు రోజుల క్రితం కురిసిన వడగండ్ల వానతో రైతులు పూర్తిగా నష్టపోయారు. దీంతో రైతు కుటుంబాలను ఆదుకోవాలని బుధవారం నిజాంపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సురేశ్ కుమార్‌కు మండల బీఆర్‌ఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సిద్దిరాములు మాట్లాడుతూ.. అకాల వర్షానికి నష్టపోయిన రైతు కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ హయాంలో రైతుల కుటుంబాలకు అండగా నిలిచామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 100 రోజుల్లో రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి నేటికీ అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటలు కరెంట్ అందించిందని, కాంగ్రెస్ పాలనలో రైతులకు15 గంటల కరెంట్ ఇస్తూ రైతులను నట్టేట ముంచుతుందన్నారు. రానున్న రోజుల్లో రైతుల పక్షాన నిలబడుతూ రైతుల గొంతుగా బీఆర్‌ఎస్ పార్టీ పనిచేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ బాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు బిజ్జ సంపత్, అబ్దుల్ అజీజ్, రెడ్డి శెట్టి రవీందర్, నాయక్, నరేందర్, నాయిని మహేశ్, లక్ష్మణ్, సుధాకర్, బాజరాములు, పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



ఆర్‌ఐ గంగాధర్ గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న భారతీయ కిసాన్ సంఘం సభ్యులు

**భారతీయ కిసాన్ సంఘం ఆధ్వర్యంలో...**

భారతీయ కిసాన్ సంఘం ఆధ్వర్యంలో పంట నష్టపోయిన ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ గంగాధర్ గౌడ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, మెదక్ జోనల్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, కార్యదర్శి అనిల్ కుమార్, మండలాధ్యక్షుడు రాజ్యం, బాగుల్ గౌడ్, రత్నగారి రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## నేడు బీజేపీ మండల కార్యకర్తల సమావేశం

**హవేళిఘణాపూర్(మెదక్):** బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు మండలంలో పర్యటించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు ఈర్ల రంజిత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 7 గంటలకు మండల పరిధిలోని కూచాద్రి వేంకటేశ్వరాలయానికి చేరుకొని పూజలు నిర్వహించి అనంతరం హవేళిఘణాపూర్‌లో జరిగే కార్యకర్తల సమావేశానికి హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

## ఈటల రాజేందర్‌ను కలిసిన బీజేపీ నాయకులు



**మనోహరాబాద్(తూప్రాన్):** బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ జన్మదినం సందర్భంగా మనోహరాబాద్ మండల బీజేపీ నాయకులు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు మొక్కలను అందజేసి సత్కరించారు. వీరిలో నాయకులు నత్తి మల్లేశ్, చంద్రశేఖర్, వెంకటేష్, నర్సింహ, భిక్షపతి, సుధాకర్, మురళి, నాగరాజు, మల్లేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు రేగోడ్ మండల సర్వసభ్య సమావేశం

**రేగోడ్(మెదక్):** మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ సరోజన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీతారావమ్మ బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులు, అధికారులు రావాలని ఆమె కోరారు.

# చిన్నారి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

**కౌడిపల్లి(నర్సాపూర్):** ఈదురు గాలులతో మృతి చెందిన చిన్నారి కుటుంబాన్ని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి బుధవారం పరామర్శించారు. సోమవారం రాత్రి మండలంలోని రాజిపేట జాజి తండాలో మాలోత్ మాన్‌సింగ్, మంజూల దంపతుల ఇంటిపైకప్పు రేకులు ఈదురు గాలివానతో ఎగిరిపోగా చీరతో కట్టిన ఊయల్లో ఆడుకుంటున్న చిన్నారి సీత(5) ఎగిరిపోయి కిందపడి మృతి చెందిన విషయం విధితమే. ఈ విషయం తెలిసి ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చిన్నారి మృతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజునాయక్, ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నయీం, జాజితండా మాజీ సర్పంచ్ రమేశ్, నాయకులు కిశోర్‌గౌడ్, శివ, లింగం, చంద్రశేఖర్‌గుప్తా, సంజీవ్, రామానుజం, ప్రతాప్‌గౌడ్, రవిసాగర్ తదితరులు పాల్గొన్నారు. దీంతోపాటు తిమ్మాపూర్ గ్రామంలో మనెమ్మ మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. మహ్మద్‌నగర్ గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డికి వైద్యం కోసం రూ. 1లక్ష ఎల్‌ఓసీ అందజేశారు.



రాజిపేట జాజితండాలో చిన్నారి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

# మట్టి తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్లు సీజ్

**టేక్మాల్(మెదక్):** అక్రమంగా మట్టిని తరలిస్తున్న జేసీబీ, మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు బుధవారం ఎస్‌ఐ మురళి తెలిపారు. మండలంలోని ఎల్లుపేట శివారులోని చెరువులో మట్టిని తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందిందన్నారు. అక్కడకు వెళ్లి పరిశీలించగా ఎటువంటి అనుమతులు లేకుండా ఒక జేసీబీ సాయంలో మూడు ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారన్నారు. ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



జేసీబీని సీజ్ చేసిన ఎస్‌ఐ

# వాహనాల తనిఖీలు చేపట్టాలి



పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

**ములుగు(గజ్వేల్):** పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సిద్దిపేట జిల్లా సరిహద్దు గ్రామం ములుగు మండలం వంటిమామిడి రాజీవ్ రహదారిపై ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా మద్యం, మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు.